

"ఇక మీదట మనం ఇంత ఫ్రీగా కలుస్కోవటం కుదరదు'' పార్క్‌లోని పిచ్చి మొక్కల్ని పీకుతూ అన్నది కోమల.

# అమ్మాయిలూ జాగ్రత్త!

బొమ్మడి అచ్చారావు

"**ఏం,** ఎందుకని? వాటీజ్‌ద ప్రాబ్లమ్?'' అడిగాడు సూర్య.

''మా హాస్టల్ వార్డెన్‌గా మా ఎలక్ట్రానిక్స్ మేడమ్ నియమించబడ్డారు. ఆవిడ మహా స్ట్రిక్టు. మగ దోమని హాస్టల్లోకి ప్రవేశించటాన్ని సహించదామె. అలాగే మేం బయటికి రావాలంటే అసలు పర్మిషన్ ఇవ్వదు. ఇక మనం ఒకర్నొకరు చూసుకోవటం కూడా కుదరకపోవచ్చు'' చెప్పింది కోమల.

''ఏం ఎలక్ట్రానిక్స్ మేడమ్‌కి పెళ్లి కాలేదా?''

''కరెక్ట్‌గా చెప్పారు. ఆమె కావాలనే పెళ్లి చేసుకోలేదు. ఆమెకు మగాళ్లంటే ద్వేషం.''

''అంటే... ఎవడి చేతిలోనో దారుణంగా

# మిడ్‌నైట్ ఛాన్స్

మోసపోయిందన్నమాట! అందుకే పెళ్లికి ఫరెవర్ గుడ్‌బై చెప్పేసిందన్నమాట! ఇలాంటి వాళ్లు శాడిస్టులుగా మారి అందర్నీ కాల్చుకు తింటారు. హాస్టల్ టైమింగ్స్‌లో బయటకు రానియ్యకపోతే పోనీ! కాలేజి టైంలో మనం కలుసుకోవచ్చు. కాలేజ్ అయ్యే సమయానికి హాస్టల్‌కి చేరిపోవచ్చు. మనకి మాత్రం దారులు లేవా?'' నవ్వాడు సూర్య. కోమల కూడా నవ్వింది.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని ''ఇంకా ఎన్నాళ్లిలా మనం దూరంగా వుండటం? నిన్నిలా చూస్తూ నన్ను నేను నిగ్రహించుకో లేకుండా వున్నాను. కాస్త కనికరించకూడదా?'' అన్నాడు జాలిగా.

కోమల వచ్చే నవ్వును మునిపంట దాచుకుని, 'ఏం కనికరించాలట!?' అన్నది.

''అదిగో, నీకంతా తెలుసుననీ నీ నవ్వే చెపుతోంది. మనం ఒకళ్లనొకళ్లు బాగా అర్థం చేసుకున్నాం. ఒకరంటే మరొకరు ప్రేమాభిమానాలు పెంచుకున్నాం. ఒకరి కోసం మరొకరు బతుకుతున్నాం. అలాంటపుడు ఒకరి కోరికలు మరొకరు తీర్చుకోవాలా, వద్దా?''

''ఏమిటో ఆ కోరికలు?''

''ఏముంది? చిన్న చిన్న ముద్దులు. ఒకరి ఒడిలో ఒకరు పడుకుని, ఒకరినొకరు కౌగిలించుకుని అందులోని థ్రిల్ అనుభవించటం! ఆ తర్వాత...''

''ఊ, ఆ తర్వాత!?...''

''చెపితే కోప్పడతారేమో!''

''పడనులే చెప్పు!''

''ఆ తర్వాత స్త్రీ పురుషులిద్దరు ఎందుకు జన్మెత్తారో అది సార్థకం చేసుకోవాలి ... నువ్వు నేను కలిసి ఒకటే అని రుజువు చేసుకోవాలి. ఒకటై పోవాలి!''

''బా...బోయ్! నీ మనసులో ఇన్ని కోరికలున్నాయా?''

''ఏం, ఉండకూడదా? ఇవేమైనా విపరీతమైన కోరికలా? అందరూ కోరుకునేదేగా!''

''పోనీ, ఇంతగా అడుగుతున్నావు కాబట్టి బుగ్గ మీద చిన్న ముద్దు పెట్టుకోవటానికి ఒప్పుకుంటు న్నాను''

''చిన్న... ముద్దా!? అదీ బుగ్గమీద!''


''అవును, ఏం?''

''ఇలా దగ్గరగా రా ...అంతదూరంగావుంటే ముద్దెలా పెట్టుకునేది? ... ఊ... మరికొంచెం దగ్గరగా...'' ఆమె భుజాలు రెండూ పట్టుకుని దగ్గరకు లాక్కుని ఆమె ఎర్రటి లేలేత పెదాల మీద గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు సూర్య.

కోమలకు ఊపిరాడలేదు. అతను ఆమెను వదిలిపెట్టకుండా అలా సుదీర్ఘంగా ముద్దు పెట్టుకుంటూ ఆమెను పొదివి పట్టుకుని గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు. ఆమె మెత్తటి ఎదపొంగులు అతని గుండెల మీద ఒత్తుకున్నాయి. ఇద్దరిలోను పులకింతలు. ఇంకా ఏదో కావాలనే ఆరాటం!

అయితే కోమల వెంటనే అతన్ని విడిపించుకుని దూరంగా జరగాలనుకుంది. కాని జరగలేకపోయింది. సూర్య ఆమె బలహీనతను చక్కగా ఉపయోగించుకున్నాడు. ఆమెను బలంగా సందిట బంధించి ఆమె శరీరంలోని సున్నితమైన భాగాల మీద మృదువుగా ముద్దులు పెట్టాడు. ఆమె శరీరమంతా జలదరించింది. తనకు తెలియకుండానే అతని వీపు మీదకు చేతులు పోనిచ్చి బలంగా అదుముకుంది. అతని చేతులు ఎక్కడెక్కడో తడుముతూ ఆమె భుజాల మీది నుండి నడుము మీదికి అక్కడి నుంచి మరికాస్త దిగువకు జరిగాయి. ఆమె మైనం ముద్దలా మారిపోతోంది. అతన్ని మరింతగా




హత్తుకుంది.

అతని చేతులు ఆమె పొత్తి కడుపు మీద పడ్డాయి.

అంతే! కోమలలోని ఆడపిల్ల ఎలర్టయింది. వెంటనే మత్తు వదిలిపోయింది. జరుగుతున్నది, జరగబోయేది తెలిసొచ్చింది. వెంటనే అతన్నుంచి విడిపించుకుని ''చాలా టైమైంది. క్లాసులైపోయుంటాయి. నేను వెంటనే హాస్టల్‌కి వెళ్లాలి.'' అంటూ లేచింది కోమల.

''ఇదిగో, ఈ గిఫ్ట్ నీకోసం!'' సూర్య ఓ అందంగా ప్యాక్ చేసిన ఆర్టికల్‌ని ఆమె కందించాడు.

''ఏమిటిది?'' అడిగింది.

''హాస్టల్‌కి వెళ్లాక విప్పి చూడు'' చెప్పాడు.

''నన్ను హాస్టల్ దగ్గర డ్రాప్ చెయ్యి'' అడిగింది కోమల.

తన రూమ్ చేరుకునేటప్పటికి రూంమేట్ కళ్యాణి ఆమె కోసం ఎదురుచూస్తోంది.

''టీకి వెళ్దాం, గమ్మున ఫ్రెషప్ అయిరా!'' అన్నది కళ్యాణి కోమల వంక పరీక్షగా చూస్తూ.

''క్షణంలో వస్తాను'' అంటూ బాత్‌రూంలో దూరి స్నానం చేస్తుంటే ఇందాకటి మధుర క్షణాలు గుర్తొచ్చాయామెకు. అతని ముద్దుల్లో ఎంత వేడి! తన ఒళ్లంతా ఝుల్లుమనగా తనువులోని అణువణువు ఏదో కావాలనే కోరికతో, ఇంకా ఇంకా అతనిలో లీనమై పోవాలనిపించింది. తను మరి కాసేపు అలాగే కళ్లు మూసుకుని వుంటే జరక్కూడనిది జరిగిపోయేది. పెళ్లి కాకుండా తన కన్యాత్వం మంట కలిసిపోయుండేది.

అమ్మో! ఆ ఆలోచన రాగానే భయంతో వణికిపోయింది. ఏమయినా సరే అతనితో పెళ్లి విషయం తేల్చుకోవాలి!

''ఇంకా ఎంతసేపు? రావే, గమ్మున!'' బయటి నుంచి అరిచింది కళ్యాణి.

కోమల స్నానం ముగించి దుస్తులు మార్చుకున్నాక, ''ఏమిటీ ప్యాక్? ఏమైనా షాపింగ్ చేశావా?'' అని అడిగింది కళ్యాణి.

గతుక్కుమన్నది కోమల. గదిలో వున్నది తామిద్దరే! కళ్యాణికి సూర్య గురించి తెలుసు.

''సూర్య ప్రెజెంట్ చేశాడు కదూ!...''

మౌనంగా తలూపింది కోమల.

''నువ్వు క్లాసులు ఎగ్గొట్టి అతనితో తిరగటం ఏమీ బాగో లేదే! అసలు పెద్దవాళ్లకు తెలియకుండా పరాయి మగాళ్లతో బయట తిరగటం చాలా డేంజర్! మగాళ్లు అవకాశవాదులు. మనకి తెలియకుండానే వాళ్ల మాయమాటల్లో పడి మన సర్వస్వం అర్పిం చుకుంటాం. ఆ తర్వాత చేతులు కాలతాయి.''

''ఊహూ, సూర్యా అలాంటివాడు కాడు. నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. మా పెద్దవాళ్లతో మాట్లాతానన్నాడు.''

''అయితే ఆలస్యం దేనికి? మాట్లాడమను! ఆ తర్వాత ఇక అడ్డేముంది?... అయినా నీకో మాట చెపుతాను వింటావా? మనం హాస్టల్లో వుండి చదువుకుంటున్నాం. ఇంకా రెండేళ్లయితే గాని మనకీ బి.టెక్. పూర్తి కాదు. ఇంతలోనే ప్రేమా దోమా అంటూ చదువు నుంచి డైవర్ట్ అయ్యావు. మనం డిగ్రీ తెచ్చుకున్నాక ఆలోచించాల్సిన పెళ్లి గురించి ఇప్పుడెందుకు తొందర?''

''ఊహూ! తొందరేం లేదు. డిగ్రీ పూర్తయ్యాకే పెళ్లి!''

''అయితే పూర్తయ్యే లోపల శోభనం జరిగిపోతుంది.''

''అదేమిటే అలా అంటావు? నామీద నమ్మకం లేదా?''

''ఛఛ! నువ్వంటే నమ్మకమే! కాని మగాళ్ల మీదే నమ్మకం లేదు. నీ వయసు మీద నాకు నమ్మకం లేదు అది మన మాట వినదు. మగాడి వేడికి వెన్నలా కరిగిపోతుంది.''

''అయితే సూర్యతో మాట్లాడటం మానెయ్యమంటావా? అది నా వల్ల కాదే! అతన్ని చూడకుండా అతనితో మాట్లాడకుండా ఒక్కరోజు కూడా బతకలేదు.''

''అయితే అతనికోసం ఏమైనా చెయ్యగలిగే స్థాయికి ఎదిగావన్నమాట! ఇలాంటప్పుడే మనసు గతి తప్పుతుంది. దాన్ని మగాడు తనకి అనువుగా మలచుకుంటాడు. పెళ్లి కమిట్‌మెంట్ లేకుండానే ప్రేమ కమిట్ అయిపోతుంది. తర్వాత మనం అవుటాఫ్ కంట్రోల్! ఇక చెప్పేదేముంది?''

''నువ్వు మరీ భయపెట్టేస్తున్నావే!''

''ఓకే! ఒక్క ప్రశ్న అడుగుతాను. అతనేం చేస్తుంటాడు? అతని బాక్‌గ్రౌండ్ ఏమిటి?''

''సూర్య పెద్ద బిజినెస్ మేగ్నెట్! వాళ్ల ఫాదర్‌కి చాలా కంపెనీల్లో షేర్లున్నాయి. సొంతంగా ఓ సినిమా హాలు, పెద్ద పౌల్ట్రీ బిజినెస్ వున్నాయి.''

''ఇవన్నీ నువ్వు చూశావా?''

''సూర్య చెప్పాడు... అతని దగ్గర వీటి తాలూకు విజిటింగ్ కార్డులు చూశాను. ఎప్పుడూ బిజీగా వుంటాడు. రెండు మూడు సార్లు దూరం నించి వాళ్ల సినిమా హాలు, పౌల్ట్రీ ఫారం చూపించాడు కూడా!''

''అసలు మీ ఇద్దరికి పరిచయం ఎలా అయింది?''

''అబ్బా చెప్పాను కదే! షాపింగ్‌కు వెళ్లినపుడు పరిచయమయ్యాడని! ఆ రోజు నేను పర్స్ తెచ్చుకోవటం మరచిపోయా. తీరా కావలసిన కాస్మెటిక్స్ అన్నీ ప్యాక్ చేయించుకున్నాక కౌంటర్ దగ్గర చూసుకున్నాను. షాపతను ఏదోలా చూశాడు. అప్పుడే అతను నన్ను అవమానం నుంచి రక్షించి బిల్ తను పే చేసి ప్యాకెట్ చేతిలో పెట్టాడు... ఆ రోజు నువ్వు జ్వరంతో రూమ్‌లోనే ఆగిపోయావు కదా!...''

''అవును, ఇదివరకోసారి చెప్పావు... నేనిప్పుడు ఆ ప్రశ్న ఎందుకడిగానో తెలుసా? ముక్కూ మొహం తెలియని ఓ వ్యక్తి నీ సామాన్లకి బిల్ కడుతుంటే నువ్వెలా అంగీకరించావు అన్నదే ప్రశ్న!... షాపువాడు ఏమనుకుంటే మనకేం. పర్స్ మరచి

పోయాను, తర్వాత వస్తాను అని చెప్పి వచ్చేస్తే ఈ పరిచయం ప్రేమగా మారేది కాదు గదా!... నీకు చదువు మీద కాన్సంట్రేషన్ పోయేది కాదు గదా! ...''

''అబ్బ, జరిగిపోయిందానికి ఇంత ఉపోద్ఘాతమా?''

''నీకు చిరాగ్గానే వుంటుందని నాకు తెలుసు ... సరి, జరగబోయేది చెపుతాను. ఈసారి సూర్య నిన్ను కలిసినపుడు ఖచ్చితంగా పెళ్లి గురించి తేల్చుకో! మీ పేరెంట్స్‌ని కలవమని చెప్పు. వాళ్ల పేరెంట్స్‌ని చూపించమను. నిన్ను వాళ్లకు పరిచయం చెయ్యమను. అతను రెండింట్లో దేనికీ అంగీకరించకపోతే నీ సోకాల్డ్ 'ప్రేమ'కు గుడ్‌బై చెప్పెయ్యి. ఓ పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకోగలిగినందుకు సంతోషించు... పద, టీ తాగి వద్దాం!'' కళ్యాణి కోమల జబ్బ పట్టుకుని డైనింగ్ హాల్‌కి లాక్కుపోయింది.

❖❖❖

**మ**ర్నాడు సరిగ్గా పదకొండు గంటలకు సూర్య వచ్చేసరికి క్లాసులు ఎగ్గొట్టి అతని కోసం కాలేజీ గేటు దగ్గర ఎదురు చూస్తోంది కోమలి.

వస్తూనే ఆమెను నోరారా పిలుస్తూ ప్రేమగా పలకరించాడు సూర్య. కోమలి వెంటనే బైక్ వెనక ఎక్కి కూచుంది.

''ముందు ఏదైనా రెస్టారెంట్‌కి వెళ్దాం!'' అన్నాడు సూర్య. ఆమె ఏ సంగతి చెప్పకముందే స్టార్ హోటల్ ముందు బైక్ పార్క్ చేసి ఆమెను లోపలకు తీసుకువెళ్లాడు.

ఇద్దరు, టిఫిన్ ఆర్డరు చేసి తింటుండగా అడిగింది కోమలి.

''ఓసారి మీ పేరెంట్స్‌కి నన్ను పరిచయం చెయ్యవా?'' అని.

సూర్య అదిరిపడి చూశాడామె వంక.


''మా పేరెంట్స్‌కా? ఇంత షడన్‌గానా?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఏం, ఎప్పటికైనా తెలియాలి కదా!'' సూటిగా అతని కళ్లలోకి చూస్తూ అన్నది కోమలి.

''అవుననుకో, అయినా ముందుగా వాళ్లను మెంటల్‌గా ప్రిపేర్ చెయ్యకుండా ఒకేసారి మనం వాళ్ల ముందు పడితే బెడిసికొడ్తుంది. కొంత టైం తీసుకోవాలి. అయినా మనం పెళ్లి చేసుకునే ముందు కదా పెద్ద వాళ్లకు చెప్పాల్సింది!'' అన్నాడు సూర్య.

''అంటే, మనం పెళ్లి చేసుకోవటం లేదా ఇప్పుడు!?'' సూటిగా అడిగింది కోమల.

''మరి నువ్వు బిటెక్ పూర్తి చేయకుండా పెళ్లి




చేసేసుకుంటామా? ఇంకా రెండేళ్ళు పూర్తి కావాలిగా? అంతదాకా ఇలా కలుసుకుంటూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకుందాం'' చెప్పాడు సూర్య.

''పోనీ, మా పేరెంట్స్‌ని కలిసి మాట్లాడతానన్నావు కదా!... మా వాళ్లకు తెలీకుండా మనమిలా కలుసుకోవటం నాకెందుకో మా వాళ్లను మోసం చేస్తున్నాననిపిస్తోంది'' చెప్పింది కోమల.

అసహనంగా కదిలాడు సూర్య.

అయితే ఆ తర్వాత పది నిమిషాల్లో తను పీకల్లోతు కష్టాల్లో కూరుకు పోతానని ఏమాత్రం ఊహించినా కోమలని ఆ స్టార్ హోటల్‌కి తీసుకొచ్చి వుండేవాడు కాదు సూర్య.

''చూడు డాడీ, ఈయన నిర్వాకం?.. నేనీ మధ్య చాలా రోజులుగా ఈయన వ్యవహారం గమనిస్తున్నాను. ఒక బిడ్డకు జన్మనివ్వగానే నేను ముసలిదాన్నయిపోయానా, పడుచు పిల్లవెంట పడటానికి? ... ఇప్పటికైనా అర్థమైందా నీకు- నేనిన్నాళ్లుగా చెపుతున్నది నిజమేనని!'' అకస్మాత్తుగా తమమీద దాడి చేసిన ఆ యువతి వంక, ఆమె చంకనున్న బిడ్డవంక, ఆమె పక్కన నిల్చుని వున్న ముసలాయన వంక తెల్లబోయి చూసింది కోమల.

సూర్య పై ప్రాణాలు పైనే పోయాయి.

''ఏమయ్యా సురేంద్ర, ఏమిటీ ఆకతాయి వేషాలు? నువ్వింత తిరుగుబోతువని నేను కల్లో కూడా ఊహించలేదు. అమ్మాయి, నేను కాఫీ తాగుదామని ఈ హోటల్‌లోకి రావటం వల్ల నీ రాసక్రీడలు మా కంటబడ్డాయి. లేకుంటే ఎన్నటికీ నీ అసలు స్వరూపం తెలియక పోయేదేమో, ఎవరీ అమ్మాయి? దీనికీ నీకు ఏంటి సంబంధం?'' ఉరిమి చూస్తూ అన్నాడు ముసలాయన.

తల కొట్టేసినంత పనయ్యింది కోమలకు. కొంత అర్థమై, కొంత కాక స్థాణువులా నిల్చుండిపోయింది. ముఖ్యంగా సూర్యగా తనకు పరిచయమైన అతని పేరు సురేంద్ర అని, తనకు అబద్ధం చెప్పాడని, తనని నిలువునా దోపిడి చేసి ఘోరంగా మోసం చెయ్యబోయాడని అర్థమై నిలువెల్లా భయంతో ఒణికిపోయింది కోమల. సూర్య అనబడే ఈ సురేంద్రకు పెళ్లయిపోయిందన్నమాట! ఒక కొడుకు కూడా వున్నాడు. పక్కనున్న ముసలాయన అతని మామగారు.

తనెంత ప్రమాదంలో చిక్కుకున్నదో అర్థమై, తనని అతని భార్య, మావ ఎంత అసహ్యంగా భావిస్తున్నారో వారి మాటలు చూపులు చెప్పగా, వారికి చేతులు జోడించింది కోమల.

''నిజంగా నాకే పాపమూ తెలీదు. ఈయన తన పేరు సూర్య అని అబద్ధం చెప్పి, తనకు వివాహం కాలేదని, నన్ను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నానని, మా పెద్దవాళ్ల అనుమతితో పెళ్లి చేసుకుంటానని నన్ను నమ్మించాడు. ఇప్పుడు మీరు చెప్పేవరకు ఇతను పెళ్లయినవాడని, నన్ను మోసం చెయ్యటానికి సిద్ధపడ్డాడని తెలియదు. దయచేసి నన్ను అపార్థం చేసుకోకండి. ఈ క్షణమే ఇతనితో నాకున్న స్నేహం తెగిపోయింది. నేను మీకు అడ్డురాను'' అని గబగబ అక్కడ్నుంచి పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది కోమల.

కళ్యాణి ముందు చూపును మనసులోనే మెచ్చుకుంటూ, పెద్దగండం తప్పిపోయినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ హాస్టలు చేరుకుంది కోమల.